క్లుప్తంగా

సబ్సిడీ విత్తనాలు పంపిణీ



రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్ బాబు

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సచివాలయం పరిధిలోని రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న, జొన్న విత్తనాలను సర్పంచ్ రమేష్ బాబు మంగళవారం పంపిణీ చేశారు. విత్తనాలు పొందిన రైతులు పంట సాగు చేసి, ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని, సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు నరేష్, నజీర్ బాషా, రెడ్డికుమార్, మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు నాగేశ్వరరావు, వెంకట్రమణ, నాదముని, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



చిట్రెడ్డిపల్లెలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

చౌడేపల్లె: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి పవన్‌కుమార్ కోరారు. మంగళవారం చిట్రెడ్డిపల్లెలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 18 వతేది వరకు పశువులకు టీకాలు వేస్తామన్నారు. తీవ్రమైన జ్వరం, నీరసం, చూలు పశువులు ఈసుకుపోవడం వంటి లక్షణాలుంటాయన్నారు. వ్యాధిసోకితే పాల దిగుబడి తగ్గడం, పాలు తాగే దూడలు మృతి చెందడం, నిర్లక్ష్యం చేస్తే ఆవులు సైతం చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. మండలానికి 15 వేల టీకాలు స్టాకు అందుబాటులో ఉందని, పాడి రైతులు దీనిని సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది జానకిరామ్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



రొంపిచర్లలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచర్ల: బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని పీలేరు డివిజన్ లేబర్ ఆఫీసర్ ఆనంద్ బాబు హెచ్చరించారు. మండలంలో దుకాణాలు, వర్క్ షాపుల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బడి ఈడు పిల్లలను పనులలో పెట్టుకుంటే కార్మిక చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్, పద్మావతి, సీఆర్పీ శ్రీహరి, అనసూయ, మహిళా పోలీస్ రేష్మ, ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

–రిజిస్ట్రేషన్ లేని క్లినిక్స్ మూసివేయాలని ఆదేశం



క్లినిక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్య బృందం

వి.కోట: ప్రభుత్వ అనుమతులున్న వైద్యులు మాత్రమే వైద్య సేవలు అందించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా వైద్య బృందం పర్యటించింది. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, అక్కడ వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన పైవిధంగా మాట్లాడారు. రిజిస్ట్రేషన్ లేని క్లినిక్స్ మూసివేయాలని, ఒకవేళ అలా నిర్వహిస్తున్న పక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే క్లినిక్స్ నిర్వహించాలని, ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య బృందం పాల్గొంది.

ఉచిత శిక్షణ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో డిగ్రీ అర్హతతో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, టెన్త్ అర్హతతో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో ఉచిత శిక్షణనిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 25వ తేదీ లోపు కళాశాలలోని స్కిల్‌హబ్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. శిక్షణానంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తామని, ఆపై ఇక్కడ నిర్వహించే జాబ్‌మేళాలో ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు పొందేవచ్చని పేర్కొన్నారు.



- ఆ నలుగురి రూటే సపరేటు
- అక్రమాలకు పాల్పడ్డారంటూ నివేదిక
- ఉన్నతాధికారుల విచారణలోనూ తేలిన వాస్తవాలు
- త్వరలో వారిపై చర్యలకు ఎస్పీ నుంచి రానున్న ఉత్తర్వులు?

ఖాకీల దందా

పలమనేరు పోలీస్‌స్టేషన్‌లో నలుగురు సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. కొంత కాలంగా వీరు పలు అక్రమాలకు పాల్పడినట్టు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఎస్పీకి సమాచారం ఇవ్వడంతో దానిపై రహస్య విచారణ చేసినట్లు సమాచారం. –పలమనేరు

ఆ నలుగురూ ఎవరంటే..!

- ఇక్కడి స్టేషన్‌లో ఇంతకుముందు ఐడీ పార్టీలో పనిచేసిన ఓ కానిస్టేబుల్ గతంలో తనకు బైరెడ్డిపల్లెకు చెందిన ఒక పార్టీ నేతల అండదండలున్నాయంటూ కొన్ని సెటిల్‌మెంట్లు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో బైరెడ్డిపల్లెకు చెందిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముఖ్య అనుచరుడు తనకు బాగా తెలుసంటూ స్టేషన్‌లో అనధికారిక పెత్తనాన్ని చెలాయిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా స్టేషన్‌లోని ప్రతి విషయాన్నీ రాజకీయ నాయకులకు చేరవేస్తున్నాడనే ఆరోపణలు అతనిపై ఉన్నాయి.
- ఇదే స్టేషన్‌కు చెందిన మరో కానిస్టేబుల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద తన భార్య పేరిట ఫైనాన్స్ వ్యాపారాన్ని మొదలు పెట్టాడు. ఇంటికి సమీపంలోనే ఒక చిన్న రూమును ఫైనాన్స్ కార్యకలాపాలకు వినియోగిస్తూ, తాను పోలీసు కావడంతో ఎక్కడా ఏ సమస్యా తలెత్తకుండా వ్యాపారానికి అండగా ఉంటున్నాడు. దీనిపై నిఘా పెట్టిన ఎస్‌బీ అన్ని ఆధారాలతో విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేసినట్టు తెలిసింది.
- అలాగే పెట్రోలింగ్ విధులు నిర్వహించే కానిస్టేబుల్ స్థానికంగా ఒక ఆర్ఎంపీ కుమార్తెను వివాహం చేసుకున్నాడు. ఈ బంధుత్వంతో పట్టణంలోని ఆ సామాజికవర్గం అండ తనకుందంటూ అతను అక్రమాలకు పాల్పడినట్టు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. అంతే కాకుండా పోలీస్‌శాఖ ఇచ్చిన బైక్‌ను సైతం తన సొంత పనులకు వాడుకుంటున్నట్టు నివేదికలో అతనిపై ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు భోగట్టా.
- పోలీస్ స్టేషన్‌లో ఒక సీనియర్ కానిస్టేబుల్ స్టేషన్‌ను వచ్చే వారి సమస్యలను తాను పరిష్కరిస్తానంటూ ఫిర్యాదుదారుల సెల్ నంబర్లు తీసుకొని వారితో డీల్ కుదుర్చుకుని వారినుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినట్టు తెలిసింది. దీంతో ఈ నలుగురిపై జిల్లా ఎస్పీ రహస్యంగా శాఖాపరమైన విచారణ చేసి వాస్తవాలను ధ్రువీకరించుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీరిపై అధికారికంగా చర్యలు తీసుకుంటారనే మాట వినిపిస్తోంది. ఈ విషయమై స్థానిక సీఐ నరసింహరాజును వివరణ కోరగా.. పోలీసుల వ్యవహారం తన దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారులనుంచి అధికారికంగా ఇంకనూ ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు.

హోరెత్తిన నిరసన



పుంగనూరు: నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్ మానస, మున్నా తదితరులు

వి.కోట: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారంపై మంగళవారం విద్యార్థులు భగ్గుమన్నారు. మండలంలోని రాగశ్రీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అందరి ప్రాణాలను కాపాడే వైద్యుల ప్రాణాలను తీసిన వారిని మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలకు రక్షణ లేకుండాపోతోందని, దేశంలో ప్రతి రోజూ లైంగికదాడులు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాల్లో ఉన్న లొసుగులు, నిందితులకు శిక్షలు విధించడంలో చోటుచేసుకుంటున్న తీవ్ర జాప్యం వల్లే ఇలాంటి మానవ మృగాలకు బొత్తిగా భయం అన్నదే లేకుండాపోతోందని పేర్కొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: కోల్‌కతా ఘటనకు సంబంధించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల మండలి డిమాండ్ చేసింది. మంగళవారం పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. ర్యాలీలో సౌత్‌ఇండియా మీడియా కార్యదర్శి సుభాన్, అహ్మదుల్లా, రమేష్, రఘు,అష్రఫ్, సాజియా, సుజాత, బద్రున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి చేసి, దారుణంగా హత్య చేసిన నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించింది. మానవ హారం ఏర్పాటు చేసింది. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ మానస, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణం పోస్తున్న వైద్యుల ప్రాణాలు తీస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం దుర్మార్గమని నిరసించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మోహన్, ఆసిఫ్, ఆలీ, సుమంత్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గంగవరంలో..



పలమనేరులో..

కొత్తయిండ్లు హైస్కూల్లో వైద్య శిబిరం



విద్యార్థినిని పరీక్షిస్తున్న డాక్టర్ జయేష్, సిబ్బంది

పుంగనూరు: ప్రస్తుతం దోమల నిర్మూలనే ధ్యేయంగా విధులు నిర్వర్తించాలని స్థానిక కొత్తపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికలాఫీసర్ డాక్టర్ జయేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. వీటి బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. అలాగే ముడిబాపనపల్లె వైద్య సిబ్బంది ప్రపంచ దోమల నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మొక్కులు చెల్లించిన తంబళ్లపల్లె ఎమ్మెల్యే



కావడి మొక్కులు చెల్లిస్తున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే

సదుం: స్థానిక వళ్లీ దేవసేన సమేత ఆలయంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి మంగళవారం కావడి మొక్కులు చెల్లించారు. ఎర్రాతివారిపల్లెలోని స్వగృహంలో పూజలు చేసి పుష్పకావడిని మోసుకువచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి స్వర్ణలతమ్మ, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, కవితమ్మ, వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలత, కృష్టారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, నాగభూషణం రెడ్డి, మల్రెడ్డి, మనోహర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సురేంద్రరెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత్ బంద్‌కు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం భారత్‌బంద్‌కు పిలుపునిచ్చినట్లు మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ తెలిపారు. మంగళవారం మాల మహానాడు ప్రతినిధులతో సమావేశమయ్యారు. అశోక్ మాట్లాడుతూ, వర్గీకరణ జరిగితే మాలలు తీవ్రంగా నష్టపోతారని, అందుకే వర్గీకరణను అడ్డుకునేందుకు మాల మహానాడు తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని మాలల హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, ఆనంద్, భాస్కర్, మాణిక్యం, శీన, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు మాన్యం భూముల లీజు వేలం

చౌడేపల్లె: స్థానిక గోసలకురప్పల్లె గ్రామం వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి మాన్యం భూములు కౌలు లీజు విషయమై గురువారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు గ్రూప్ టెంపుల్ ఈఓ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల లీజుకు నాలుగు చోట్ల 16.32 ఎకరాల మాన్యం భూములకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు వెయ్యి రూపాయలు ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు రేపు

చౌడేపల్లె: స్థానిక అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం 8 గంటలకు హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

22న పెద్ద పులిగంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బైరెడ్డిపల్లె: మండలంలోని చప్పిడిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 22న పెద్దపులి గంగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో మహా గణపతిపూజ, అనుజ్ఞ పుణ్యాహవాచన, లలితా సహస్త్రనామ పారాయణం, మంగళనీరాజనం కార్యక్రమాలు నిర్వహించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: స్థానిక ఐటీఐలో ప్రవేశానికి మూడవ పర్యాయం అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన వారు ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 9 గంటలకు శాంతిపురం ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

గ్రామాభివృద్ధి కోసమే శిక్షణ తరగతులు

ఐరాల: గ్రామాల అభివృద్ధి కోసమే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించి ఎంపీడీఓ మాట్లాడారు. తాగునీరు, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, వీధి దీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రోజూ తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. చెత్త నుంచి కంపోస్టు ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయం పెంచుకోవాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ షణ్ముగం మాట్లాడుతూ, శిక్షణను సద్వినియోగం చేసుకుని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

నగరి : మున్సిపల్ పరిధిలోని అనధికార లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, అలాంటి లేఅవుట్లకు భవన నిర్మాణ అనుమతులు, రోడ్లు, కరెంటు, నీరు డ్రైనేజీ సదుపాయాలు ఇచ్చేది లేదని చెప్పారు. మున్సిపల్ పరిధిలో సదయప్ప నగర్ ఎక్స్‌టెన్షన్, బంగారు కన్నియప్ప నగర్, విజికెఎస్ లేఔట్, ఎఎంఎల్‌సి బ్రదర్ లేఔట్, విజిఎస్ నగర్, మారుతి నగర్ లేఔట్, శ్రీ నగర్ లేఔట్, అయ్యప్ప నగర్ లేఔట్, శ్రీ క్రిష్ణా నగర్ లేఔట్, కాకవేడులో సర్వే నెంబర్ 191/1,2,4,197/1,2,3,4లోను, 199/4లోను ఏర్పాటుచేసిన లేఅవుట్లు, టీఆర్ కండ్రిగ సర్వే నెంబర్ 207/3లోని లే అవుట్, ఎస్ఆర్ఎస్ అగ్రహారంలో సర్వే నెంబర్ 242/7, 264/3లలోని లేఅవుట్, తెరణిల సర్వే నెంబర్ 220/7ఎ,7బి, 220/7సిలో వేసిన లేఅవుట్, అన్నామలై నగర్ ఎక్స్‌టెన్షన్, నందాలియమ్మన్ నగర్, అన్నామలై నగర్, లక్ష్మీనగర్, సంజీవ్ నగర్, వికెవిఎం నగర్ సర్వే నెంబర్ 191/2సి, గరుడాద్రినగర్, నెత్తం కండ్రిగ సర్వే నెంబరు 167/2లోని లేఅవుట్, ఎస్ఎంటీ నగర్ లేఅవుట్, పద్మావతినగర్ లేఅవుట్, ఏకేఎన్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్, కృష్ణానగర్, నగరిలో సర్వే నెంబరు 143, 37, 92, 91, 274లో వేసిన లేఅవుట్లను అనధికార లేఅవుట్లుగా గుర్తించామన్నారు. ఈ లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. అవి రిజిస్ట్రేషన్ చేయడం కుదరదన్నారు. ఈ లే అవుట్లు వేసిన యజమానులు, డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మన చేతుల్లోనే దోమల రహిత సమాజం



బైరెడ్డిపల్లె: తీర్థంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గంగవరం: దోమ కాటు ప్రాణాంతకమని తగిన జాగ్రత్తలతో దోమలను పూర్తిగా నిర్మూలించి, దోమల రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని వైద్యాధికారి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం గంగవరం పీహెచ్‌సీలో ×మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం౯ పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దోమల మూలాన మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్నారని, ఆయన కృషి ఫలితంగానే మలేరియా వ్యాధిని నిర్మూలించేందుకు అవకాశం కలిగిందని ఆయన సేవలను స్మరించారు. మలేరియా విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడమే ఈ దినం ముఖ్యోద్దేశమన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి లహరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: తీర్థం గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్ మాట్లాడారు. దోమల వలన వ్యాప్తి చెందే జ్వరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: దోమ తెరలను వినియోగించుకుని జ్వరాల బారిన పడకుండా ఉండాలని వైద్యాధికారి ప్రవీణ్ కోరారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. నివాస పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మలేరియా, డెంగీ , చికున్ గున్యా జ్వరాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రొంపిచెర్లలో..

రొంపిచర్ల: దోమల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా రొంపిచెర్లలో అవగాహన కల్పించారు. దోమకాటు మూలాన వచ్చే వ్యాధులను వివరించారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్వరి, కాంతమ్మ, పంకజ పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం సదుంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో చికున్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతారని, దోమకాటుకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని దోమకాటుతో వ్యాధులు ప్రబలుతాయని అప్రమత్తంగా ఉండాలని చెరుకువారిపల్లె సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు గిరీషా అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.



గంగవరం: దోమల రహిత సమాజం పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది



చౌడేపల్లె: లద్దిగంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



రొంపిచెర్ల: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పల్స్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

బైరెడ్డిపల్లె: జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న పల్స్ సర్వేను పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే పూర్తయిన తరువాత జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాలలో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికిరణ్, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, ఏఈ లోకనాథం, రిసోర్స్ పర్సన్లు సద్గుణ, మహేష్, సాక్షరభారత్ కో–ఆర్డినేటర్ సురేష్‌బాబు, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాకారోత్సవం



విశేష అలంకరణలో సీతా రామ లక్ష్మణ ఉత్సవమూర్తులు

బైరెడ్డిపల్లె: శ్రావణపౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉభయదారులుగా కొత్తమాచు వెంకటాచలంశెట్టి కుటుంబీకులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.